## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- భారత సైనిక బలగాలు దేశ సార్వభౌమత్వం, సమగ్రతల పరిరక్షణలో రాజీపడవని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.
- వ్యవసాయ పరికరాలపై జీ.ఎస్.టి తగ్గింపు ఫలితం నేరుగా రైతులకు చేరాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆకాంక్షించారు.
- భారత్.. అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించడానికి మహిళలు, యువత భాగస్వామ్యం అవసరమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు.
- భారత్, ఒమన్ జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లో భారత్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశం శత్రుదేశంపై తన ప్రతిఘటనా పాటవాన్ని ప్రదర్శించిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 1965 భారత్-పాకిస్తాన్ యుద్ధం జరిగి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన స్మారక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో రక్షణ దళాలు శత్రువులపై గొప్పదైన తమ శక్తిని ప్రదర్శించాయన్నారు. భారత సైనిక బలగాలు దేశ సార్వభౌమత్వం, సమగ్రతల పరిరక్షణ విషయంలో ఎంత మాత్రం రాజీపడవనే విషయాన్ని చాటి చెప్పాయని రక్షణ మంత్రి వ్యాఖ్యానిస్తూ..

(వాయిస్ బైట్...21 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ పరికరాలపై GST రేట్ల తగ్గింపు ఫలితం నేరుగా రైతులకు చేరాలని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆకాంక్షించారు. ఈరోజు ఆయన న్యూఢిల్లీలో వ్యవసాయ యంత్రాలు, పరికరాల సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 12 శాతం లేదా 18 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం వల్ల ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ యంత్రాలు, పరికరాల ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. వివిధ రకాల ట్రాక్టర్ల ధరలు 23 వేల నుండి 63 వేల రూపాయల వరకు తగ్గే అవకాశం ఉంటుదన్న ఆయన.. ఈ ప్రయోజనం మధ్యలోనే నిలిచిపోకుండా రైతులకు చేరాలని అన్నారు. ఈ గొప్ప ప్రయోజనం రైతుల ఆదాయాల గణనీయమైన పెరుగుదలకు దోహదపడుతుందని కేంద్ర మంత్రి వివరిస్తూ...

(వాయిస్ బైట్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్.. అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించడానికి మహిళలు, యువత చురుకైన భాగస్వామ్యం ఆవశ్యకమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో జరిగిన ఫ్యూచర్ ఫ్రాంటియర్ కాన్‌క్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ.. మహిళల నేతృత్వంలో అభివృద్ధి ఇతివృత్తంగా ప్రభుత్వ ఎజెండా అమలవుతోందని

అన్నారు. గడచిన 11 సంవత్సరాల్లో భారత్.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో 11వ స్థానం నుండి 5వ స్థానానికి చేరుకుందని, 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా ముందుకు వెళుతోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం గణనీయమైన పురోగతిని సాధించిందని కిరణ్ రిజిజు పేర్కొంటూ...

(వాయిస్ బైట్...29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీలకు పోషకాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం మిషన్ సక్షమ్, అంగన్‌వాడీ, పోషణ్ 2.0 కార్యక్రమాలను చేపట్టిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేంద్ర మంత్రి అన్నపూర్ణ దేవి రాసిన వ్యాసంపై ఆయన మాట్లాడుతూ ఈ పథకాల ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లక్షలాది మంది లబ్ధిదారులు సహాయం పొందుతున్నారని చెప్పారు. ఈ పథకాలు దేశంలోని లక్షలాది మంది చిన్నారులకు మంచి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నాయని ప్రధానమంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం తీసుకున్న వివిధ చర్యలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ బైట్...90 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా కప్ 2025లో భాగంగా అబుదాబిలో భారత్-ఒమన్ ల మధ్య మ్యాచ్ కొద్దిసేపటి క్రితం మొదలయ్యింది. టాస్ గెలిచిన భారత్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. భారత్ జట్టు 6 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 60 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సాంకేతికత దేశంలో ప్రతి ఒక్కరినీ శక్తివంతంగా మార్చిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఇండియా స్టాక్, యుపిఐ, జామ్ ట్రినిటీ, కోవిన్ వంటి కార్యక్రమాలు ప్రజల జీవన విధానంపై మంచి ప్రభావం చూపాయని ఒక పత్రికకు రాసిన వ్యాసంలో కేంద్ర మంత్రి పేర్కొన్నారు. సాంకేతిక ఆవిష్కరణలు ప్రపంచ వేదికపై భారతదేశ పాత్రను బలోపేతం చేశాయని ఆయన వివరించారు. అంతరిక్ష రంగంలో దేశంలో జరిగిన ప్రయోగాలను ప్రస్తావిస్తూ.. భారత్ తొలి ప్రయత్నంలోనే అంగారక గ్రహానికి చేరుకుందని, చంద్రయాన్-3 ప్రయోగం.. చంద్రునిపై మృదువైన ల్యాండింగ్ సాధించిన నాల్గవ దేశంగాను, చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగిన మొదటి దేశంగాను భారత్‌ను నిలిపిందన్నారు. ఇస్రో ఒకే మిషన్‌లో 104 ఉపగ్రహాలను ప్రయోగించి ప్రపంచ రికార్డు సృష్టించిందని, భారతీయ రాకెట్లు ఇప్పుడు 34 దేశాల ఉపగ్రహాలను మోసుకెళ్తున్నాయని అశ్విని వైష్ణవ్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్, సిక్కిం, అండమాన్ ప్రాంతాల్లో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. మయన్మార్, బంగ్లాదేశ్ తీరాలకు తూర్పు మధ్య ప్రాంతంలోని ఈశాన్య బంగాళాఖాతంలో ఈ నెల 25వ తేదీ నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =